సాక్షి వనపర్తి

శుక్రవారం । 16 । మే । 2025



డెంగీ దడ!

మహబూబ్‌నగర్ జిల్లాలో ఏటా డెంగీ కేసుల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది.

వివరాలు 8లో ▸



అంగన్‌వాడీల్లో కంటి పరీక్షలు

అంగన్‌వాడీ చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే బృందాలతో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
39.8 /21.8

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురవచ్చు.

పాలమూరుకు అందాలభామలు

నేడు పిల్లలమర్రిని సందర్శించనున్న ప్రపంచసుందరి పోటీదారులు

- 22 దేశాలకు చెందిన అందగత్తెల రాక
- అన్ని ఏర్పాట్లు చేసిన పర్యాటక శాఖ
- మూడు అంచెల భద్రతతో భారీ బందోబస్తు ఏర్పాటు
- 2 గంటల పాటు కొనసాగనున్న పర్యటన

పాలమూరు: ఏడున్నర శతాబ్దాల చరిత్ర ఉన్న పిల్లలమర్రిలో వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు సందడి చేయనున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన పోటీదారుల బృందం శుక్రవారం పాలమూరుకు రానుంది. వారి కోసం ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 22 దేశాలకు చెందిన విదేశీ అందగత్తెలు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో సాయంత్రం 5 గంటలకు మహబూబ్‌నగర్‌కు చేరుకోనున్నారు. పిల్లలమర్రి ప్రాంతాన్ని అందంగా ముస్తాబు చేశారు. మెట్టుగడ్డ నుంచి పిల్లలమర్రి వరకు రెండు కిలోమీటర్ల మేర రోడ్డును సుందరీకరించడంతో పాటు ఇరువైపుల విద్యుత్ స్తంభాలకు రంగులు వేశారు. తెలంగాణ పండుగల విశిష్టత, సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మలు, బోనాలు, గిరిజనుల సంప్రదాయ నృత్యాల మధ్య సుందరీమణుల బృందానికి స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు.





❐ మిస్‌వరల్డ్ పోటీదారుల బృందం మహబూబ్‌నగర్‌లో రెండు గంటల పాటు పర్యటించనున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పిల్లలమర్రికి చేరుకుంటారు. పది నిమిషాల పాటు విశ్రాంతి తర్వాత మొదట చారిత్రక కళాఖండాలు, శిల్పకళలను తిలకిస్తారు. ఆ తర్వాత పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడే ఉన్న మ్యూజియాన్ని సందర్శిస్తారు. అనంతరం మూడున్నర ఎకరాల్లో విస్తరించి ఉన్న పిల్లలమర్రి మహావృక్షాన్ని తిల కిస్తారు. అక్కడే ఒక్కొక్క అందగత్తె ఒక్కొక్క మొక్క ను నాటనున్నారు. అనంతరం తిరిగి వారు రాత్రి ఏడు గంటలకు రోడ్డు మార్గంలో ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరనున్నారు.

వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు

మిస్ వరల్డ్–2025 పోటీదారుల పర్యటను సంబంధించి జిల్లా పోలీస్ శాఖ 1,008 మందితో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసింది. మూడు అంచెల భద్రత వ్యవస్థ ఉంటుంది. మొదటి వరుసలో మహిళ పోలీస్ సిబ్బంది విత్ సఫారీలో ఉండగా, రెండో వరుసలో సివిల్ పోలీస్, మూడో వరుసలో ఏఆర్ పోలీస్ బలగాలను బందోబస్తు కోసం కేటాయించనున్నారు. వీరితో పాటు స్పెషల్ పార్టీ, రాష్ట్రస్థాయి నుంచి బలగాలు పహారా కాస్తాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రంగారెడ్డి, వికారాబాద్‌ల నుంచి పోలీస్ బలగాలను రప్పించారు. ఇద్దరు ఎస్పీలు, ఒక ఏఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, 936 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు బందోబస్తులో ఉంటారు. బందోబస్తును మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ డి.జానకి పర్యవేక్షించనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

ప్రపంచ సుందరీమణుల బృందం సాయంత్రం 5 గంటలకు పిల్లలమర్రికి చేరుకుంటుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సుందరీమణుల బృందానికి స్వాగతం పలకడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. గురువారం ఎస్పీ డి.జానకితో కలిసి కలెక్టర్ పిల్లలమర్రిని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 'తెలంగాణ జరూర్ ఆనా' అనే థీమ్‌తో ప్రభుత్వం అందాల భామలు.. ప్రాచీన ఆలయాలు పర్యాటక ప్రాంతాల అందాలను తిలకించేలా ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, ఏఎస్పీ రాములు, డీఎఫ్‌ఓసత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పటిష్ట భద్రత కల్పిస్తాం..

ప్రపంచ సుందరీమణుల పర్యటన సందర్భంగా పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాటు చేస్తున్నాం. హైదరాబాద్ నుంచి పిల్లలమర్రి వరకు ప్రత్యేక కాన్వాయ్ కొనసాగుతుంది. మూడు అంచెల భద్రతతో పోలీస్ బలగాలు విధుల్లో ఉంటాయి. పర్యాటకులు, ప్రజలు మన ప్రాంతానికి వచ్చే అతిథిలతో గౌరవంగా ఉండాలి. పోలీస్‌శాఖ నుంచి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశాం. – డి.జానకి, ఎస్పీ, మహబూబ్‌నగర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి: కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికిగాను ప్రవేశాల కోసం ఈ నెల 17 నుంచి 31 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి గురువారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశం 2025, మార్చిలో 10వ తరగతి ఉత్తీర్ణులై సీజీపీఏ 7.0 లేదా 400 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలలు, రెసిడెన్షియల్, ఎయిడెడ్, నవోదయ, కస్తూర్బా, బెస్ట్ అవైలబుల్, తెలంగాణ ఆదర్శ పాఠశాలలో చదివిన విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంపిక జాబితా జూన్ 5న, ధ్రువపత్రాల పరిశీలన, కళాశాల కేటాయింపు, ఆర్డర్ పొందుట జూన్ 10న జరుగుతుందన్నారు.

ఏకలవ్య మోడల్ కళాశాలల్లో..

తెలంగాణ గిరిజన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాల బాలానగర్, కల్వకుర్తిలో 2025–26 విద్యాసంవత్సరం ప్రవేశాలకుగాను ఎంపీసీలో 14, బైపీసీలో 48, సీఈసీలో 33 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రూపుల్లో (సీబీఎస్ఈ సిలబస్) ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకుగాను 10వ తరగతి పూర్తి చేసిన గిరిజన బాలుర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుకు ధ్రువపత్రాలు జతచేసి 24వ తేదీ సాయంత్రం 4 వరకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలని సూచించారు. 26వ తేదీ ఉదయం 10 గంటలకు బాలానగర్ కళాశాలలో కౌన్సిలింగ్ ఉంటుందన్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

వనపర్తిటౌన్: కాళేశ్వరం త్రివేణి సంగమంలో ఈ నెల 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతి పుష్కరాలకు వనపర్తి డిపో నుంచి డీలక్స్, సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రానుపోను సూపర్ లగ్జరీ బస్సుకు రూ.2,320, డీలక్స్‌కు రూ.2,040 టికెట్ ధర నిర్ణయించామని.. ఆసక్తి గల భక్తులు, ప్రయాణికులు టికెట్‌ను బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కాంటాలను విధిగా పునరుద్ధరించుకోవాలి



ఖిల్లాఘనపురం: జిల్లాలోని ధర్మకాంటాలను సకాలంలో తప్పనిసరిగా పునరుద్ధరించుకోవాలని తూనికలు, కొలతల జిల్లా అధికారి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని రైస్‌మిల్లుల దగ్గర ఉన్న ధర్మకాంటాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల వరి ధాన్యం తూకం చేయించుకున్న రైతులు తూకాల్లో తేడాలను గుర్తించి ఫిర్యాదు చేయడంతో తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. మూడు కాంటాల్లో వెయ్యి కిలోలకు 10 కిలోల నుంచి 50 కిలోల వరకు ఎక్కువ రావడం జరిగిందన్నారు. దీంతో రైతులకు ఎలాంటి నష్టం జరగలేదని.. టెక్నీషియన్లు అన్ని కాంటాలను సరిచేసినట్లు వివరించారు.

సోళీపురంలో సీజ్..

మండలంలోని సోళీపురం గ్రామ ఎస్ఎల్ఎన్ఎస్ రైస్‌మిల్లు దగ్గర ఉన్న ధర్మ కాంటను సీజ్ చేసి కేసునమోదు చేసినట్లు జిల్లా తూనికలు, కొలతల అధికారి సత్యనారాయణ తెలిపారు. రైస్‌మిల్లు బయట ఉన్న కాంటను ఎలాంటి అనుమతి లేకుండా లోపలికి మార్చారని.. అదేవిధంగా కాంటా దగ్గర బాట్లు లేకపోవడం , గడువు ముగిసినా పునరుద్ధరించుకోక పోవడంతో సీజ్ చేసినట్లు చెప్పారు.

సాగు ప్రణాళిక సిద్ధం

2025–26 వానాకాలంలో జిల్లాలో పెరగనున్న వరి, పత్తి సాగు విస్తీర్ణం



అమరచింత మండలం ధర్మపురం శివారులో దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

- రోహిణి కార్తెలో పత్తి విత్తనాలు విత్తేందుకు అనువు
- 2,05,570 ఎకరాల్లో వరి సాగు అంచనా
- మొత్తం పంటల సాగు విస్తీర్ణం 2,55,324 ఎకరాలు

అమరచింత: జిల్లాలో వానాకాలం పంటల సాగుకు రైతులు వేసవి దుక్కులు దున్నుతూ.. రోహిణి కార్తెలో పత్తి విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు జిల్లా వ్యవసాయ అధికారి దిశా నిర్దేశంతో మండల వ్యవసాయశాఖ అధికారులు, ఏఈఓలు వానాకాలం సాగు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. గతేడాది వానాకాలంలో జిల్లావ్యాప్తంగా 2.48 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు కాగా.. ఈసారి 2,55,324 ఎకరాలకు పెరగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని రైతుల వద్దకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, సంబంధితశాఖ అధికారులు వెళ్లి పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేస్తున్నారు. ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుండటంతో వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తం అవుతున్నారు.

వరి, పత్తి సాగుకే ప్రాధాన్యం..

జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉండటంతో వానాకాలంలో రైతులు అత్యధికంగా వరికే ప్రాధాన్యం ఇస్తారు. కొన్ని గ్రామాల్లో వర్షాధారంతో పత్తి సాగు చేసేందుకు రైతులు ఇప్పటికే తమ పొలాలను చదును చేసి ఉంచారు. జూరాల ఎడమ కాల్వతో పాటు ఎత్తిపోతల పథకాల ఆయకట్టులో వరి సాగు అంచనా మరింత పెరిగే అవకాశం ఉంది. సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రభుత్వం ప్రకటించడంతో వాటి సాగుపై దృష్టి సారిస్తున్నారు.

రైతువేదికల్లో అవగాహన కార్యక్రమాలు..

సాగునీరు పుష్కలంగా లభించే ప్రాంతాల్లో ఎలాంటి పంటలు సాగు చేయాలి.. నీటి వనరులు లేని ప్రాంతాల్లో ఏయే పంటలు సాగు చేయాలనే విషయాలపై రైతువేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పంటల మార్పిడితో కలిగే ప్రయోజనాలు, జూరాల ఎడమ కాల్వ ఆయకట్టులో ఎలాంటి వరి వంగడాలను ఎంపికచేసుకోవాలనే విషయాలను వివరిస్తున్నారు. వీటికితోడు ఎరువులు ఏ సమయంలో ఎంత మొత్తం వినియోగించాలి, రసాయన మందులను ఎలా పిచికారీ చేయాలనే విషయాలపై కూడా అవగాహన కల్పిస్తున్నామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. శాస్త్రీయ పద్ధతిలో సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని చెబుతున్నారు. వేసవిలో భూయాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటలకు హాని కలిగించే కారకాలను నిర్మూలించే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

వరి సాగే అధికం..



మండలంలో సాగునీటి వనరులు అధికంగా ఉండటంతో ఇక్కడి రైతులు అధికంగా వరి సాగుపైనే దృష్టి సారిస్తున్నారు. జూరాల ఎడమ కాల్వ, అమరచింత ఎత్తిపోతల పథకం ఆయకట్టులో ఎలాంటి వరి వంగడాలు వినియోగించాలో రైతులకు వివరిస్తున్నాం. – అరవింద్, ఏఓ, అమరచింత

ప్రణాళికతో ముందుకు..



జిల్లాలో వానాకాలం పంటల సాగు ప్రణాళిక జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆదేశాలతో పూర్తి చేశాం. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తుండటంతో రైతులు అత్యధికంగా వాటి సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. పత్తి, చెరుకు, కంది సాగుకు రైతులు మక్కువ చూపుతున్నారు. వానాకాలం సాగుకు ఎంత మేర విత్తనాలు, ఎరువులు అవసరమనే వివరాలను ఏఓలతో సేకరించి సాగుకు ముందే నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. – దామోదర్, ఏడీఏ, కొత్తకోట

వానాకాలం పంటల సాగు అంచనా..

పంట	విస్తీర్ణం (ఎకరాల్లో..)
వరి	2,05,570
జొన్న	2,020
పత్తి	15,303
మొక్కజొన్న	9,474
వేరుశనగ	8,266
కంది	7,111
మిర్చి	2,115
చెరుకు	1,356
మినుములు	1,082
ఆముదం	414

'డబుల్' సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి రూరల్: పట్టణంలోని చిట్యాల రోడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆవాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్ గురువారం పుర కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 27 బ్లాక్‌లలో 648 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించగా, 300 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. 15 బ్లాక్‌ల వరకు మాత్రమే తాగునీటి వసతి కల్పించారని, డ్రైయినేజీ నిర్మాణం పూర్తి చేయకుండానే సీసీ రహదారి వేస్తున్నారని చెప్పారు. అలాగే వీధిదీపాలు లేక రాత్రిళ్లు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, చెత్త సేకరణకు ట్రాక్టర్‌ను పంపాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పరమేశ్వరాచారి తదితరులు ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గురువారం ఉదయం సెమిస్టర్–6 పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 47 పరీక్ష కేంద్రాల్లో 9,333 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 8,946 మంది హాజరయ్యారు. 385 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెమిస్టర్–2కు సంబంధించి 9,842 మంది విద్యార్థులు 9,250 హాజరై 592 మంది గైర్హాజరయ్యారు. కాగా. తొలిరోజు ఇద్దరు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కె.ప్రవీణ తెలిపారు.

DCCB

సేల్ ఆఫీసర్, మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్, ఆత్మకూర్ శాఖ

బహిరంగ వేలము ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా శ్రీ కుర్వ నడిపి బాలయ్య తండ్రి : సీతారామయ్య, మోట్లంపల్లి గ్రా॥, ఆత్మకూర్ మం॥, వనపర్తి జిల్లా. మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్, ఆత్మకూర్ నుండి దీర్ఘకాలిక అప్పు కింద బర్రెలు కొనుగోలు నిమిత్తము తీసుకున్న ఋణము తిరిగి చెల్లించనందున, అట్టి బకాయి అసలు + వడ్డీ మరియు ఇతరములు రాబట్టుటకు క్రింద చూపబడిన స్థిరాస్తులు భూములు విడి విడిగా గాని లేక అన్ని సర్వే నెంబర్లు కలిపి గాని, సహకార సంఘముల చట్టము 1964 ప్రకారము తేది:22-05-2025 గురువారం రోజున ఉదయం గం॥ 11-30 ని॥లకు గ్రామపంచాయతీ కార్యాలయము, మోట్లంపల్లి, ఆత్మకూర్ మం॥, వనపర్తి జిల్లా నందు బహిరంగ వేలము ద్వారా విక్రయించబడును.

క్రమ సం॥	బకాయిదారుని పేరు మరియు తండ్రి పేరు భూములు ఉన్న గ్రామాలు	సర్వే నం.	విస్తీర్ణము ఎ.గుం.	అప్సెట్ వ్యాల్యు రూ.లక్షలో	వేలము తేది సమయము	వేలము వేయు ప్రదేశము
1	2	3	4	5	6	7
1	శ్రీ కుర్వ నడిపి బాలయ్య తండ్రి : సీతారామయ్య మోట్లంపల్లి గ్రా॥, ఆత్మకూర్ మం॥, వనపర్తి జిల్లా.	49/అ	2.93	16,87,500	22-05-2025 గురువారం ఉదయం గం॥ 11:30 ని॥లకు	గ్రామపంచాయతీ కార్యాలయం, మోట్లంపల్లి గ్రా॥, ఆత్మకూర్ మం॥, వనపర్తి జిల్లా.
			2.93			

కావున వేలములో పాల్గొనదలచినవారు పాల్గొనగలరు.

సదరు వేలమునకు సంబంధించిన నిబంధనలు :

1. వేలము పాల్గొనువారు ధరావత్తు (EMD) బాపతు రూ॥25,000/-లు సరిపడు పైకమును బ్రాంచి మేనేజర్/సేల్ ఆఫీసర్ మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్, ఆత్మకూర్ శాఖ పేరిట చెల్లింపు అయ్యేట్లుగా డిమాండ్ డ్రాఫ్టు తీసుకొని మేనేజర్/సేల్ ఆఫీసర్ గారికి తేది:21-05-2025 బుధవారం రోజు ఉదయం 11-00 గం॥ల లోపుగా అందజేసి రశీదు పొందగలరు.
2. అత్యధిక వేలము పాట పాడిన వారు వేలము పాట మొత్తములో 15% శాతము పైకమును వెంటనే సేల్ ఆఫీసర్ గారికి చెల్లించి తగు రశీదు పొందగలరు. మిగిలిన 85% శాతము 15 రోజులలో చెల్లించవలసి ఉండును. రిజిస్ట్రేషన్‌కు అవసరమగు స్టాంప్‌డ్యూటీ కూడా వీరే చెల్లించవలయును. ఒకవేళ అట్టి గడువు లోపల చెల్లించనిచో వేలము రద్దు చేస్తూ మొత్తము చెల్లించిన 15% శాతము పైకము ఎట్టి పరిస్థితులో కూడా తిరిగి ఇవ్వబడదని తెలియజేయమైనది.
3. ఎటువంటి కారణము చూపకనే సదరు వేలము నిలిపివేయుటకు, వాయిదా వేయుటకు, రద్దు పరుచుటకు సేల్ ఆఫీసర్ గారికి అధికారము కలదు.
4. వేలము వేయుటకు స్థిరాస్థిపై బకాయి ఉన్నట్లయినచో మరియు రిజిస్ట్రేషన్‌కు అయ్యే ఖర్చులు వేలములో కొన్నవారే భరించవలెను.
5. వేలము పాట పాడేవారు 5,000/-లు కన్న తక్కువ పెంచుటకు వీలులేదు.

సం/- సేల్ ఆఫీసర్
జిల్లా సహ. కేంద్ర బ్యాంకు లి. మహబూబ్‌నగర్
బ్రాంచ్ : ఆత్మకూర్. సెల్:9912222054

స్థలం : ఆత్మకూర్
తేది : 15-05-2025

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

వీపనగండ్ల: కొనుగోలు కేంద్రాల్లో రైతులు నిల్వచేసిన వరి ధాన్యం తడిసినా కొనుగోలు చేస్తామని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు గురువారం మండల కేంద్రంలో తూంకుంట సింగిల్‌విండో ఆధ్వర్యంలో అదనపు కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 379 కొనుగోలు కేంద్రాల నుంచి 1.64 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం (80 శాతం) రైతుల నుంచి సేకరించామని తెలిపారు. ధాన్యాన్ని జిల్లాలోని 71 రైస్‌మిల్లులకు తరలించి నిల్వ చేస్తున్నామని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లుల్లో మరాడించి రైతులు నష్టపోకుండా చూస్తామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ వరలక్ష్మి ఉన్నారు.

లారీల సమస్య లేకుండా చూడాలి

వనపర్తి: కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన వరిధాన్యం తరలించేందుకు లారీల సమస్య లేకుండా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఎస్పీ, డీటీఓ, కో–ఆపరేటివ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కేంద్రానికి అవసరాన్ని బట్టి లారీలను అందుబాటు లో ఉంచాలన్నారు. సకాలంలో లారీలను సమకూర్చకుంటే కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు

గోదాం తనిఖీ..

పాన్‌గల్: మండల కేంద్రంలోని గోదాంను గురువారం రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి నిల్వ చేసిన ధాన్యం బస్తాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం బస్తాల లారీలను త్వరగా ఖాళీ చేసేలా చూడాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్ల బదిలీలు

నారాయణపేట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 13 మంది తహసీల్దార్లను బదిలీ చేశారు. అలాగే ఇతర జిల్లాల నుంచి నలుగురు పాలమూరుకు రానున్నారు. ఎన్నికల సమయంలో పరిపాలన ప్రాతిపదికన రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు తహసీల్దార్లకు కేటాయించారు. కాగా.. తిరిగి తమ జిల్లాలకే బదిలీ చేయాలని కొందరు తహసీల్దార్లు భూ పరిపాలన ప్రధాన కమిషనర్‌ను కోరడంతో.. వారి విన్నపం మేరకు బదిలీ చేశారు. ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.బదిలీలు అయినా తహసీల్దార్లు కేటాయించిన జిల్లా కలెక్టర్లకు శుక్రవారం రిపోర్టు చేయాల్సి ఉంది.

బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలు

తహసీల్దార్	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.రాధాకృష్ణ	జోగుళాంబ గద్వాల	మహబూబ్‌నగర్
సలీముద్దీన్	జోగుళాంబ గద్వాల	నాగర్‌కర్నూల్
మదన్‌మోహన్‌గౌడ్	మహబూబ్‌నగర్	జోగుళాంబ గద్వాల
యు.పులిరాజు	మహబూబ్‌నగర్	జోగుళాంబ గద్వాల
జి.నాగలక్ష్మి	మహబూబ్‌నగర్	నారాయణపేట
తిరుపతయ్య	మహబూబ్‌నగర్	నారాయణపేట
బి.వెంకటేశ్	నారాయణపేట	నాగర్‌కర్నూల్
జె.రాంకోటి	నాగర్‌కర్నూల్	నారాయణపేట
ఎస్.కిరణ్మయి	నాగర్‌కర్నూల్	నల్లగొండ
బి.మల్లికార్జునరావు	నారాయణపేట	మహబూబ్‌నగర్
డి.లక్ష్మి	వనపర్తి	జోగుళాంబ గద్వాల
షహీదాబేగం	జోగుళాంబ గద్వాల	వికారాబాద్
జి.చంద్రశేఖర్	నాగర్‌కర్నూల్	సూర్యాపేట
జి.సైదులు	యాదాద్రి భువనగిరి	నాగర్‌కర్నూల్
బి.శాంతిలాల్	యాదాద్రి భువనగిరి	వనపర్తి
వై.ధానయ్య	వికారాబాద్	నారాయణపేట
బి.శ్రీనివాసులు	నల్లగొండ	మహబూబ్‌నగర్

క్లుప్తంగా

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

శాంతినగర్: కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వడ్డేపల్లి మండలంలోని కొంకలలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కొంకల గ్రామానికి చెందిన కురువ ఈరన్న(38) నాలుగేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం కడుపునొప్పి ఎక్కువ కావడంతో జూలెకల్ శివారులోని వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జూలెకల్ రైతులు ఈ సమాచారం కుటుంబసభ్యులు అందించడంతో ఈరన్నను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతని భార్య కురువ సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఏఎల్‌ఎం మృతి

శాంతినగర్: గడ్డిమందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురైన విద్యుత్‌శాఖకు చెందిన ఏఎల్‌ఎం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన ఏఎల్‌ఎం చాకలి రాజశేఖర్ శాంతినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్దూరు శివారులో పొలంలోని గెట్లకు ఉన్న గడ్డిని తొలగించేందుకు ఈనెల 4న గడ్డి మందు కొట్టడానికి వెళ్లాడు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా మందు పిచికారీ చేశాడు. మందు కొడుతున్న సమయంలో ముక్కు, నోటి ద్వారా శరీరంలోకి పోవడంతో అస్వస్థతకు గురికావడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ వివరించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నాడు.

మృతదేహం లభ్యం

ఇటిక్యాల: ఎర్రవల్లి మండలంలోని వేముల గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభించినట్లు కోదండాపురం ఎస్‌ఐ మురళి తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కొంకాలపల్లి గ్రామానికి చెందిన శేషయ్య(56) బుధవారం దేవర నిమిత్తం కోదండాపురంలో తమ బంధువుల ఇంటికి వచ్చాడు. అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరితో కలిసి వేముల శివారులోని జక్కం బావి దగ్గరకు ఈత పడేందుకు వెళ్లగా, ప్రమాదవశాత్తు బావిలో కాలు ఇరుక్కొని గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని రెండు రోజుల పాటు శ్రమించి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి కుమారుడు రాంభూపాల్ ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న డీసీఎం అడ్డాకుల పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వృద్ధుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడికి తలకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వృద్ధుడిని అంబులెన్స్‌లో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వృద్ధుడు అపస్మారక స్థితికి చేరుకోవడంతో వివరాలు తెలియ రాలేదని ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

హైవేపై ఘోరం

- కొడుకుతో కలిసి బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం
- భార్య మృతి.. తండ్రీకొడుకుకు తీవ్రగాయాలు



తిమ్మమ్మ (ఫైల్)

ఇటిక్యాల: కొడుకుతో కలిసి బైక్‌పై బయల్దేరిన భార్యాభర్తలను విధి వక్రీకరించింది. గుర్తుతెలియని వాహనం రూపంలో మృత్యువు వెంటాడింది. 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా.. తండ్రీకొడుకుకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ వెంకటేశ్ వివరాల మేరకు.. అయిజ మండలం గురుదొడ్డి గ్రామానికి చెందిన ఉస్సేన్ రెడ్డి గురువారం తెల్లవారుజామున తన భార్య తిమ్మమ్మ (30), 13ఏళ్ల కుమారుడు జగన్మోహన్‌రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై వనపర్తి జిల్లా గంగవరం గ్రామంలోని తన చెల్లెల్లి వద్దకు బయలుదేరారు. మార్గమధ్యంలోని ఎర్రవల్లి మండలం జింకలపల్లి సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో అతడి భార్య తిమ్మమ్మ అక్కడికక్కడే మృతిచెందగా.. ఉస్సేన్ రెడ్డి, అతడి కొడుకు జగన్మోహన్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో గద్వాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు దేవేందర్ రెడ్డి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డెంగీ దడ..!

- జిల్లాలో పెరుగుతున్న కేసులు
- వ్యాధి వ్యాప్తికి అపరిశుభ్రతే కారణం
- నిల్వ నీటితో దోమల వ్యాప్తి
- నేడు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం



పాలమూరు: డెంగీ.. ఈ పేరు వింటనే దడ పుడుతోంది. చిన్నపాటి దోమ కుట్టడంతో రూ.లక్షలు వెచ్చించే పరిస్థితి ప్రస్తుతం ఉంది. డెంగీ పరీక్షలతో పాటు చికిత్సకు సైతం ఆస్పత్రుల్లో అధికంగా డబ్బులు వసూలు చేస్తూ రోగుల జేబుకు చిల్లు పెడుతున్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, అరుబయట మురుగు, ఇతర కారణాలతో దోమలు వృద్ధి చెంది డెంగీ వ్యాప్తికి కారణమవుతున్నాయి. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

నియంత్రణ ఇలా..

వానాకాలంలో నీటి కాలుష్యం ఎక్కువ. పిల్లలు, వృద్ధులు, గర్భిణులకు కాసి వడబోసిన నీటిని తాగించాలి. ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా చూసుకోవాలి. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిలిస్తే దోమలు, ఈగలు వృద్ధి చెందే అవకాశాలు ఎక్కువ. వాంతులు, విరోచనాలు అవుతుంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. చిన్న జ్వరం, జలుబుకు పిల్లలకు యాంటీబయోటిక్స్ ఇవ్వకుండా వైద్యుల సూచన మేరకే మందులు ఇవ్వాలి.

డెంగీ కేసుల నమోదు ఇలా..

ఏడాది	నమోదైన కేసులు
2024	481
2025 (ఇప్పటి వరకు)	35

అవగాహన కల్పిస్తున్నాం..

గ్రామాల్లో అంగన్‌వాడీలు, ఆశాలు, ఏఎన్‌ఎంల ద్వారా ప్రజలకు డెంగీ వ్యాధి ఎలా వస్తోందనే అంశంపై అవగాహన కల్పిస్తున్నాం. పట్టణాల్లో డెంగీ కేసులు నమోదవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నాం. డెంగీ కేసులు నమోదవుతున్న గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు తరలిస్తున్నాం. ఇళ్ల నడుమ మురుగు నిల్వకుండా చూసుకోవాలి. జనరల్ ఆస్పత్రిలో డెంగీ కిట్లు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వారికి అక్కడ పరీక్షలు నిర్వహిస్తారు.

– డా. కృష్ణ, జిల్లా వైద్యాధికారి



ఓ గ్రామంలో మురుగునీటిని పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

వ్యాధి లక్షణాలు..

ఈడిస్ ఈజిప్టై అనే దోమతో డెంగీ సోకుతుంది. నల్లగా ఉండే ఈ దోమ ఒంటిపై తెల్లని చారలు ఉంటాయి. అందుకే దీన్ని టైగర్ దోమగా పిలుస్తారు. ఇది కుట్టిన 7 నుంచి 8 రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం రావటం, కళ్లు కదలించలేని పరిస్థితి ఏర్పడుతుంది. భరించలేని కండరాల నొప్పి, వాంతులు, వికారం రక్తంతో కూడిన మల విసర్జన, కడుపునొప్పి ఉంటాయి. రక్తపోటుతో పాటు రక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. అన్ని అవయవాలు వైఫల్యం చెంది ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంటుంది. లక్షణాలు ముందే గుర్తిస్తే పూర్తిస్థాయిలో చికిత్స అందించవచ్చు. వాతావరణ మార్పులతో ఒక్కసారిగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుంది. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో రోగాల బారిన పడకుండా చూసుకోవచ్చు. దోమలు నిల్వ ఉండటంతో డెంగీ సోకుతుంది. అపరిశుభ్ర పరిసరాలు, ఓపెన్ నాలాలు, మురుగు నిల్వలు దోమలు వృద్ధికి కారణాలు. వర్షాకాలం సీజన్‌లో అవే చాలా సమస్యాత్మకం. ప్లాస్మోడియం, వైవాక్స్ ప్లాస్మోడియం ఫాల్సీపారం అనేవి రెండు రకాలు. ఇందులో రెండో రకం చాలా ప్రమాదకరం.



క్రికెట్ ఆడి.. యువతలో ఉత్సాహం నింపి

కొల్లాపూర్‌లోని మినీ స్టేడియంలో గురువారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సరదాగా క్రికెట్ ఆడారు. మార్నింగ్ వాక్‌కు వచ్చిన ఆయన.. స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న యువకులతో కొంతసేపు ముచ్చటించారు. ఆ తర్వాత వారితో కలిసి క్రికెట్ ఆడి ఉత్సాహం నింపారు. ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం, క్రీడలు దోహదం చేస్తాయని.. ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం చేసేందుకు, క్రీడలు ఆడేందుకు కొంత సమయం కేటాయించాలని సూచించారు.

- కొల్లాపూర్

టాస్క్‌ఫోర్స్ పోలీసులపై దాడి

ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు




పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక టిప్పర్

కొత్తపల్లి: లింగాల్ చేడ్ వాగునుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను కొత్తపల్లి గ్రామ శివారులో ఆపి తనిఖీ చేయగా, టిప్పర్ డ్రైవర్ ఎండీ షరీఫ్ ఆపకుండా ముందుకు వెళ్లాడు. కొద్ది దూరం వెళ్లి రోడ్డు పక్కకు ఇసుకను అన్‌లోడ్ చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే టిప్పర్ యజమాని ఎండీ మహబూబ్ బాషా, అతని కొడుకు ఖాదర్ వెంటనే అక్కడికి వచ్చి టాస్క్‌ఫోర్స్ పోలీసులను బూతులు తిడుతూ దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు లోకల్ మద్దూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని టిప్పర్‌ను, దాడికి పాల్పడిన ముగ్గురిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసు ఉద్యోగులకు ఆటంకం కలిగించి, దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మద్దూరు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కిడ్నాప్ చేసిన వ్యక్తులపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని గుండాల గ్రామానికి చెందిన నారాయణ ధర్మారెడ్డి అనే వ్యక్తిని బుధవారం తెల్లవారు జామున హైదరాబాద్‌కు చెందిన మహేందర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డిలు కారులో కిడ్నాప్ చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. బాధితుడు ధర్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి పేర్కొన్నారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. గుండాల గ్రామానికి చెందిన ధర్మారెడ్డి తన సొంత పొలం 2 ఎకరాల భూమిని మాడిగేజ్ చేసి హైదరాబాద్‌కు చెందిన మల్లికార్జున్‌రెడ్డి వద్ద డబ్బుల ఒప్పందం కుదుర్చుకున్నాడు. కానీ మల్లికార్జున్‌రెడ్డి 2ఎకరాలకు బదులు 20 ఎకరాలకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేశారు. గమనించిన ధర్మారెడ్డి భూమి మాడిగేజ్‌కు ఒప్పుకోలేదు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మల్లికార్జున్‌రెడ్డి తండ్రి మహేందర్‌రెడ్డితో బుధవారం తెల్లవారు జామున ధర్మారెడ్డిని కారులో బలవంతంగా తీసుకెళ్లారు. అనంతరం గురువారం వదిలేశారు. దీంతో తనను కిడ్నాప్ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు ఆలయ భూముల కౌలు వేలం



అలంపూర్ ఆలయాల సముదాయం

అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయాల భూముల కౌలు వేలం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు భూముల బహిరంగ వేలం ప్రారంభమవుతుందన్నారు. ఏప్రిల్ 21న ఆలయాలకు సంబంధించిన పలు సర్వే నెంబర్లలోని భూముల బహిరంగ కౌలు వేలం నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేలం పాటలో కొన్ని సర్వే నంబర్లకు సరైన కౌలు ధర రాకపోవడంతో వేలం నిలిపివేసినట్లు తెలిపారు. వాటికి సంబంధించి ఈ నెల 2న మరోసారి వేలం నిర్వహించినా.. రైతులు ఆసక్తి చూపకపోవడంతో శుక్రవారం మూడోసారి వేలం నిర్వహిస్తున్నామన్నారు. తక్కశీల గ్రామంలోని సర్వే నంబర్ 253లో 4.04 ఎకరాల భూమి మాదక్క పట్టెలు పొలం, అలంపూర్ శివారులోని సర్వే నంబర్ 566లో 9.28 ఎకరాలు కుమ్మరి గుట్టల పొలం, సర్వే నంబర్ 960లోని 9.04 ఎకరాలు తంగడి మాను చేను, బైరంపల్లిలోని సర్వే నంబర్ 11లోని 11.13 ఎకరాలు ఈదుల గడ్డ పొలం, చందాపూర్‌లోని సర్వే నంబర్ 20లో ఉన్న 7.08 ఎకరాలు, కర్నూల్ జిల్లాలోని కల్లూరులో సర్వే నంబర్ 346/1, 346/3లోని 15.18 ఎకరాలు పెరుగువాని చేనుకు కౌలు వేలం కొనసాగుతుందన్నారు. వేలంలో పాల్గొనే రైతులు రూ.50 వేలు డిపాజిట్ ఆలయ ఈఓ పేరు మీద డీడీ తీసి ఇవ్వాలని, ఆధార్ కార్డుతో పాటు ఏదైన బ్యాంకు ఖాతాలకు సంబంధించిన రెండు చెక్కులు సమర్పించాలని కోరారు. పాత బకాయిలు ఉన్న రైతులు, ఇతర బకాయిలు ఉన్న రైతులు వేలం పాటలో పాల్గొనడానికి అనర్హులుగా పేర్కొన్నారు. వివరాలకు 94404 54656, 88867 61196 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రీనివాసులు
- ఖిల్లాఘనపురం మండలంలో 9 క్లినిక్‌ల సీజ్



ఖిల్లాఘనపురంలో ఓ ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాసులు

ఖిల్లాఘనపురం: అర్హత లేకపోయినా కొంతమంది ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రీనివాసులు హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం ఖిల్లాఘనపురం వచ్చిన ఆయన డీఈఎంఓ రవి కుమార్‌తో కలిసి గ్రామంలోని ప్రాథమిక చికిత్స కేంద్రాలను పరిశీలించారు. స్థాయికి మించి వైద్యం అందిస్తున్న 9 క్లినిక్‌లను గుర్తించి సీజ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో క్లినిక్‌లను ఏర్పాటు చేసుకొని అవగాహన లేని వైద్యం చేస్తూ ఇష్టారీతిగా డబ్బులు లాగుతున్నారని మండిపడ్డారు. అదేవిధంగా కమీషన్లకు ఆశ పడి అవసరం లేకపోయినా ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు, ల్యాబ్ టెస్టులకు రిఫర్ చేస్తున్నారన్నారు. అలాంటి ప్రథమ చికిత్స కేంద్రాలు సుశ్రుత క్లినిక్, నరేందర్‌గౌడ్, బాల్‌రాజ్, భాగ్యమ్మ, నరేందర్‌బాబు, శ్రీనివాసులు, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేష్ కు చెందిన మొత్తం 9 క్లినిక్‌లను సీజ్ చేశామన్నారు.

ముమ్మరంగా దాడులు

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు పాన్‌గల్‌లో 2, శ్రీరంగాపురంలో 2, పాలెంలో 2, వనపర్తిలో 5, ఖిల్లాఘనపురంలో 9, ఆత్మకూర్‌లో 1, బలిజపల్లిలో 2 మొత్తంగా 23 క్లినిక్‌లను సీజ్ చేశామన్నారు. ఆర్‌ఎంపీలు అవగాహన లేకుండా ఇచ్చే మందుల వలన ప్రజలకు ప్రాణాపాయం ఏర్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈఎంఓ రవికుమార్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నీలిచిత్రాలు చిత్రీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాడని..

- యువకుడి ఫొటో స్టూడియో ధ్వంసానికి యత్నం
- పోలీసుల అదుపులో నిందితుడు
- కంప్యూటర్ హార్డ్ డిస్క్ స్వాధీనం

హన్వాడ: మండల కేంద్రంలో ఫొటో స్టూడియో నిర్వహిస్తున్న ఓ యువకుడు నీలిచిత్రాలు చిత్రీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఉదంతం హాట్‌టాపిక్‌గా మారింది. విషయం తెలుసుకున్న స్థానిక యువకులు ఆగ్రహంతో ఊగిపోతూ.. గురువారం సదరు యువకుడి ఫొటో స్టూడియోను ధ్వంసంచేసి నిప్పంటించేందుకు విఫలయత్నం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. హన్వాడకు చెందిన ఎజాస్ కొంతకాలంగా స్థానికంగా ఫొటో స్టూడియో ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అతడు కోయిల్‌కొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో సన్నిహితంగా ఉంటూ.. శారీరకంగా కలిసినప్పటి చిత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాడు. ఈ దృశ్యాలను స్థానిక యువకులు కొందరు గుర్తించడంతో విషయం వెలుగు చూసింది. అయితే సదరు యువతి గిరిజనురాలు కావడం.. ఆమె అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుసుకున్న స్థానిక ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, భజరంగ్‌దళ్ నాయకులు ఒక్కసారిగా ఆ యువకుడి ఫొటో స్టూడియోపై దాడికి పాల్పడ్డారు. అప్పటికే విషయం తెలుసుకున్న అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ క్రమంలో ఫొటో స్టూడియోపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు యువకులు విఫలయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను చెదరగొట్టారు. ఫొటో స్టూడియోలోని కంప్యూటర్ హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం సదరు యువకుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్‌ఐ వెంకటేష్‌ను వివరణ కోరగా.. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు లేదని.. రోడ్డుపై జనాలు గుమ్మిగూడి ఉండటంతో చెదరగొట్టామని తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

చారకొండ: అదుపు తప్పి కారు బోల్తా పడిన ఘటన మండలంలోని మర్రిపల్లిలో ప్రధాన రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా చిట్యాలకు చెందిన సురేష్ కుటుంబంతో కలిసి కారులో విశాఖపట్నం వెళ్లి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో మండలంలోని మర్రిపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో పోసిన మట్టి కుప్పలను కారు ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్ప గాయాలతో బయట పడ్డారు. చికిత్స నిమిత్తం స్థానికులు మండ కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వానాకాలం సాగుకు ముందస్తు ప్రణాళిక

పాడి-పంట

గద్వాల జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: వానాకాలం సీజన్‌లో పంట సాగు సకాలంలో జరగాలంటే ముందు నుంచే రైతులు ప్రణాళికలు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఇందుకు గాను రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పనుల గురించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్ వివరించారు.



పంట పొలాల్లో నాగలి తోలుతున్న రైతు

దుక్కులు దున్నడం..

ముందస్తు దుక్కులు దున్నడం వలన తొలకరి వర్షాలకు భూమి నీటిని పీల్చుకొని తేమ శాతం పెరగడానికి దోహదపడుతుంది. వాలుకు అడ్డంగా దున్నే దుక్కిలతో వర్షపు నీరు ఒకవైపు వెళ్లకుండా నేల కోతను ఆరికడుతుంది. తోటల్లో ఉండే మొండి జాతి కలుపు మొక్కలు, దుంపలు వేళ్లతో సహా బయటికి ఊడి వస్తాయి. దీనికి తోడు నిద్రావస్థలో ఉన్న పలు కీటకాలు నశిస్తాయి. సేంద్రియ ఎరువులైన పశువు పేడ, వర్మికం పోస్టులను పొలాలకు వేయాలి.



దుక్కి దున్నిన పంట పొలం

భూసార పరీక్షలు

భూమిలో పోషక విలువలు తగ్గిపోయి పంటల్లో సూక్ష్మపోషక లోపాలు ఎక్కువగా కనిపిస్తాయి. పోషకాలను పట్టి ఉంచే శక్తి, గాలి, నీరు చొచ్చుకొని వెళ్లే లక్షణం, మురుగు తీత మొదలైన గుణాలే కాకుండా రసాయనిక లక్షణాలైన ఉదజని సూచిక, లవణ పరిమాణం, లభ్య పోషకాలు చర్యల మొదలైనవి పెరుగుదల, దిగుబడిపై ప్రభావం చూపుతాయి. ఈ నేపథ్యంలో భూసార పరీక్షలు చేయించాలి. ఏడాదికి ఒకటి, రెండు పంటలు పండించే భూముల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షా కేంద్రాల్లో అందజేయాలి. వారి సూచన మేరకు పంట సాగు చేసుకోవడం మంచిది.

పచ్చిరొట్ట పైర్ల సాగు

తొలకరి వర్షాలకు జనుము, జీలుగ, పిల్లి పెసర, అలసంద మొదలగు పంటలను పండించి భూమిలో దున్నాలి. దీంతో ఎకరాకు 25–30 కిలోల యూరియాను ఆదా చేసుకోవచ్చు. భూమి ఆరోగ్యంగా ఉంటుంది. జనుము, పల్లి పెసరలు ఎరువులుగానే కాకుండా పశువుల మేతగా ఉపయోగపడుతుంది.

పొలం గట్ల తయారీ

పంటలపై తీసుకోనే శ్రద్ధ పొలం గట్లు, మురుగు కాల్వలపై చూపించడం లేదు. వీటిలో వివిధ రకాలైన ఒయ్యారి భామ, మూల మాతంగి, నీరు గొబ్బి, గొంగల గరాకు, గరక రాకసి, తుంగ వంటి మొక్కలు పంటలతో పాటు పెరిగే వివిధ రకాలైన వ్యాధులు వచ్చేందుకు పురుగుల వ్యాప్తికి కారణమవుతాయి. వేసవిలోనే తప్పనిసరిగా పొలం గట్లు, మురుగు కాలువల్లో కలుపు లేకుండా చూసుకోవాలి.

విత్తనాల ఎంపిక ముఖ్యం

తాలు గింజలు, సగం నిండని గింజలు, కలుపు విత్తనాలు వేరు చేసి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. సర్టిఫైడ్ విత్తనం కాని, పరిశోధన స్థానాల నుంచి సేకరించిన విత్తనాలను తీసుకోవాలి. ఏ విత్తనమైన మొలక శాతం తెలుసుకోకుండా నారు పోయకూడదు. ఎంపిక చేసిన విత్తనాలను తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి. విత్తన శుద్ధి చేసిన 12 గంటల తర్వాతనే విత్తనాన్ని భూమిలో విత్తుకోవాలి.

చౌడు భూములను బాగు చేసుకోవడం..

భూగర్భ జలాలను విరివిగా వాడటంతో నీటిలోని క్లోరైడ్ ద్వారా పొలాలు చౌడు భూములుగా మారుతాయి. భూసార పరీక్షలను అనుసరించి చౌడు భూములను వ్యవసాయ యోగ్య భూములుగా మార్చేందుకు వేసవి కాలం అనువైన సమయం. ఎండాకాలంలో నేలపైకి పొంగి ఉన్న ఉప్పు చౌడును పారలతో తొలగించాలి. మురుగు నీరు పోయేలా ఏర్పాటు చేసుకోవాలి. పొలాన్ని చదును చేసి దాదాపు 20–25 సెంట్ల మడులను విభజించి గట్టు వేయాలి. కారు చౌడు నేలలు ఎండినప్పుడు గడ్డపార వేసిన పెకలక రాయి వలే ఉంటుంది. తగినంత నీరు, తేమ ఉన్నప్పుడు మొత్తటి, చిక్కటి బురద తయారవుతుంది. ఇలాంటి నేలలను వేసవిలో బాగు చేసుకోవచ్చు.

WANTED TEACHERS
RAVI TEJA HIGH SCHOOL & RAVI TEJA JUNIOR COLLEGE NARAYANPET.
Required The Qualified & Experienced staff to teach from Nursery to X all subjects and IIT & NEET Level as well as required junior college staff.
Submit the Resume on or before 18-05-2025
Contact Numbers : 9160947155, 9885760740, 6304521541, 9440421172
English Fluency is must
Sd/- Principal Raviteja Talent School, Narayanpet.

సాక్షి క్లాసిఫైడ్స్
WANTED
Wanted Female Assistant Hostel Incharges in a Reputed Educational Organisation, Qualification Any Inater / Degree, Age Limit: 25 to 45years, Salary upto: 15,000/- (plus Food and Accommodation) Working Location: Dilshuknagar, Hyd. Contact : 9248733346, 9248733362
సాక్షి భవిత విద్యార్థుల కోసం
సాక్షి ద్వారా మీ ఆత్మీయుల పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే
HAPPY BIRTHDAY
గమనిక
- సాక్షి మేనేజ్‌మెంట్

క్లుప్తంగా...

ఫీజు బకాయిలు వెంటనే చెల్లించండి

ముఖ్యమంత్రికి బండి సంజయ్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏటా నిర్ణీత వ్యవధిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గురువారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యపూరిత ధోరణితో లక్షలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్ సహా వేలాది కాలేజీలు పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయాయని పేర్కొన్నారు. గత నాలుగేళ్లుగా ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో దాదాపు 8 వేల కోట్ల రూపాయలు బకాయిలుగా పేరుకుపోయినట్లు ఆయన తెలిపారు. ప్రైవేట్ కళాశాలలు అధ్యాపకులకు, సిబ్బందికి జీతభత్యాలు, నిర్వహణ చార్జీలు కూడా చెల్లించలేక అవస్థలు పడుతూ.. అప్పుల పాలయ్యాయని పేర్కొన్నారు. ఫీజు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇచ్చేది లేదని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు తెగేసి చెబుతుండటంతో విద్యార్థులు అటు ఉద్యో గానికి దరఖాస్తు చేసుకోలేక, ఇటు ఉన్నత విద్య ను అభ్యసించే అవకాశం లేక తీవ్రమైన ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారని బండి సంజయ్ తెలిపారు.

సినీ జర్నలిస్ట్ - రచయిత బీకే ఈశ్వర్ కన్నుమూత

సాక్షి, హైదరాబాద్: సీనియర్ సినిమా జర్నలిస్ట్, ప్రముఖ సినీ రచయిత బీకే ఈశ్వర్ (77) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం హైదరా బాద్‌లో తుదిశ్వాస విడిచారు. విజయవాడకు చెందిన బీకే ఈశ్వర్ 'విజయచిత్ర' పత్రికలో రెండు దశాబ్దాలపాటు ఉప సంపాదకునిగా పనిచేశారు. పలు పత్రికలకు, వీక్లీలకు వ్యాసాలు రాయడంతోపాటు కొన్ని టీవీ సీరియల్స్ కూడా రాశారాయన. వాటిలో కొన్ని నంది అవార్డులను అందుకున్నాయి. 'హృదయాంజలి' చిత్రానికి మాటలు, పాటలు అందించారు. అదే విధంగా 'కాలేజ్ డేస్ టు మ్యారేజ్ డేస్, చీకటిలో నేను, నగరంలో వినాయకుడు, జంబో క్రైమ్ స్టోరీ, అజయ్ పాసయ్యాడు, నేను-ఆదీ- మధ్యలో మా నాన్న'వంటి సినిమాలకు రచయితగా పనిచేశారు. 'సూపర్ మూవీస్ అడ్డా' పేరుతో సొంత యూట్యూబ్ చానెల్‌ను నిర్వహించారు.

'సరస్వతి' పునాదిగా

పుష్కర వేడుకలు

త్వరలో వచ్చే గోదావరి, కృష్ణా పుష్కరాలనూ ఘనంగా నిర్వహిస్తాం

సమ్మక్క సారలక్క జాతరను వైభవంగా జరిపిస్తాం

ఈ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా...

కాళేశ్వరం ప్రాంతానికి ఘనచరిత్ర ఉంది.. ఈ ప్రాంత అభివృద్ధికి రూ.200 కోట్లు

చతుర్వేద పుష్కరఘాట్ వద్ద ఘనంగా సరస్వతి పుష్కరాలు ప్రారంభం

త్రివేణి సంగమంలో మంత్రులతో కలిసి సీఎం పుష్కరస్నానం



శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఆది శ్రీనివాస్

కాళేశ్వరం నుంచి సాక్షి ప్రతినిధి, వరంగల్

'సరస్వతి పుష్కరాలు పునాదిగా త్వరలో వచ్చే గోదావరి, కృష్ణా పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం. మేడారం సమ్మక్క సారలక్క జాతరను ఘనంగా జరిపిస్తాం. తెలంగాణ ప్రభుత్వం నా హయాంలో ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించడం నా అదృష్టంగా భావిస్తున్నా' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నదులను పూజించడం మన సంస్కృతి, సంప్రదాయమని, అందుకే నదులను దేవతలు, దేవుళ్లుగా పూజిస్తున్నామని చెప్పారు. జేఎస్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గురువారం ప్రారంభించిన సరస్వతి పుష్కర వేడుకల్లో రేవంత్ పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 4.12 గంటలకు కాళేశ్వరం చేరుకున్న రేవంత్‌రెడ్డికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రేవంత్ సరస్వతి ఘాట్‌ను ప్రజలకు అంకితం చేశారు. ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన వేదికపై నుంచి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. మెదక్ జిల్లా రంగంపేటకు చెందిన మాధవానంద సరస్వతి స్వామిజీ ప్రారంభించిన పుష్కరాలు ఈ నెల 26 వరకు కొనసాగుతాయి.

కాళేశ్వరం అభివృద్ధికి రూ.200 కోట్లు

మంథని నియోజకవర్గానికి పెద్ద చరిత్ర ఉందని, దేశ ఆర్థికాభివృద్ధికి ఆద్యుడైన పీవీ నరసింహారావు మంథని నుంచి గెలిపొందారని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రపంచంలో మన దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేసిన ఆయన మంథని ప్రాంతానికి ఎంతో చేశారన్నారు. రాష్ట్రానికి రూ.వేల కోట్ల పెట్టుబడులను తేవడంలో మంత్రి శ్రీధర్‌బాబు కృషి చాలా గొప్పదని కొనియాడారు. మంథని నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కష్టపడే శ్రీధర్ బాబును ప్రజలే కాపాడుకోవాలన్నారు. ఆయన సేవలు రాష్ట్రం యావత్తు అవసరమని, ఆయన నియోజకవర్గ అభివృద్ధికి తక్కువ సమయం కేటాయించి, రాష్ట్ర అభివృద్ధికి ఎక్కువ సమయం కేటాయించాలని సూచించారు. కాళేశ్వరాన్ని గొప్పగా అభివృద్ధి చేయడానికి రూ.100 కోట్లు కావాలని శ్రీధర్‌బాబు అడిగారని, కానీ తాము రూ.200 కోట్లయినా వెచ్చిస్తామని రేవంత్ చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాళేశ్వరం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని మంత్రి సురేఖ, ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌లను కోరుతున్నానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి గ్రీన్ చానల్‌లో నిధులు విడుదల చేస్తామని చెప్పారు.

టెంట్ సిటీ వద్ద గంటసేపు..

హెలిప్యాడ్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి వీఐపీ ఘాట్ సమీపంలో భక్తులకోసం ఏర్పాటు చేసిన టెంట్ సిటీకి చేరుకున్నారు. రేవంత్ సుమారు గంటపాటు టెంట్ సిటీలో గడిపారు. పుష్కరాల ఏర్పాట్లు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులతో పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. పుష్కర ఘాట్ త్రివేణి సంగమం ఒడ్డున ఏర్పాటు చేసిన 17 అడుగుల సరస్వతీ మాత విగ్రహం, రెండు వైపుల చతుర్వేద మూర్తుల విగ్రహాలను రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం త్రివేణి సంగమంలో మంత్రులతో కలిసి పుష్కర పుణ్యస్నానం ఆచరించారు. తర్వాత శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి, శుభానంద దేవిని, ప్రౌఢ సరస్వతి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఎం, మంత్రులు, వారణాసి నుంచి వచ్చిన అషుతోష్ పాండే, 8 మంది వేద పండితుల బృందం ఆధ్వర్యంలో మహా సరస్వతి నవరత్న మాలిక హారతి ఇచ్చారు. శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని ఆహ్వానించలేదని నిరసన

భూపాలపల్లి: సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఆహ్వానించలేదంటూ అతడి వర్గీయులు నిరసన చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి పుష్కర ఘాట్ వద్ద సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సమయంలోనే చెన్నూరు నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సభాస్థలి ఎదుట నిలబడి ఫ్లెక్సీలతో నిరసన చేపట్టారు. ఈ క్రమంలో సీఐ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒక నాయకుడిపై చేయి చేసుకున్నారు. పోలీసు ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం భక్తులు, మీడియా, వీఐపీలకు ఇబ్బందికరంగా మారింది.

రూ.12,600 కోట్లతో ఐఎస్‌జీజేవీ

- ఆర్వోఎఫ్ఆర్ భూఅభివృద్ధికి ఇందిర సౌరగిరి జల వికాసం
- రానున్న ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 2.10 లక్షల గిరిజన రైతులకు లబ్ధి
- పథకం అమలుకు మార్గదర్శకాల విడుదల

సాక్షి, హైదరాబాద్: అటవీ హక్కుల చట్టం-2006 కింద గుర్తింపు పొందిన గిరిజన రైతుల భూముల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా ఇందిర సౌరగిరి జల వికాసం (ఐఎస్‌జీజేవీ) పథకాన్ని అమలు చేయనుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు, నిధుల కేటాయింపులు తదితర వివరాలతో కూడిన ఉత్తర్వులను గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్ గురువారం విడుదల చేశారు. ఐఎస్‌జీజేవీ పథకం కింద రానున్న ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.12,600 కోట్లు ఖర్చు చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 2.10 లక్షల మంది రైతులను ఎంపిక చేస్తూ, వారికి చెందిన 6 లక్షల ఎకరాల భూములను అభివృద్ధి చేస్తూ సౌరవిద్యుత్‌తో జలసిరులు వచ్చే విధంగా వ్యవసాయ యోగ్యంగా మార్చడంతోపాటు అందులో వివిధ రకాల వ్యవసాయ కార్యక్రమాల అమలుకు ఈ నిధులు ఖర్చు చేయనుంది. ఒక్కో రైతును ఒక యూనిట్‌గా పరిగణిస్తూ.. ఒక్కో యూనిట్‌పైన రూ.6 లక్షలు చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.

18న ప్రారంభించనున్న సీఎం

ఆర్వోఎఫ్ఆర్ చట్టం-2006 కింద రాష్ట్రంలో 6.69 లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేశారు. తాజాగా ఐఎస్‌జీజేవీ పథకం కింద ఈ భూములను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ పథకాన్ని ఈనెల 18న అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఈమేరకు గిరిజన సంక్షేమశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకాన్ని 2025-26 నుంచి 2029-30 వరకు వందశాతం రాయితీతో అమలు చేస్తారు. అటవీ శాఖ, ఇంధన శాఖ, ప్రజారోగ్యం, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భ జల వనరులు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ మరియు ఇతర సహకార విభాగాల సమన్వయంతో అమలు చేస్తారు. ఐఎస్‌జీజేవీ అమలు కోసం, జిల్లా స్థాయిలో ఇన్‌చార్జ్ మంత్రి అనుమతితో కలెక్టర్ ఖరారు చేస్తారు. పథకం అమలును పర్యవేక్షించడానికి జిల్లాల్లో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లు (పీఎంయూ) ఏర్పాటు చేస్తారు.

ఐదేళ్ల వార్షిక ప్రణాళిక ఇలా...

సంవత్సరం	ఎస్టీ రైతులు	విస్తీర్ణం	బడ్జెట్(రూ.కోట్లలో)
2025-26	10,000	27,184	600
2026-27	50,000	1,43,204	3,000
2027-28	50,000	1,43,204	3,000
2028-29	50,000	1,43,204	3,000
2029-30	50,000	1,43,204	3,000
మొత్తం	2,10,000	6,00,000	12,600

రూ.8.6 కోట్ల నగదు.. రూ.23 కోట్ల నగలు

- వీవీఎంసీ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి ఇళ్లు, ఆఫీసుల్లో ఈడీ స్వాధీనం
- అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చి భారీగా అక్రమాస్తుల ఆర్జన
- ఏపీ, తెలంగాణలో స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చి భారీ మొత్తంలో ఆస్తులు కూడబెట్టిన వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ (వీవీఎంసీ) టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి గుట్టు రట్టు చేశారు ఈడీ ముంబై జోనల్ కార్యాలయం అధికారులు. వీవీఎంసీలో అక్రమంగా 41 భవనాలు నిర్మించిన కుంభకోణంలో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టి వైఎస్ రెడ్డి ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు నిర్వహించింది. బుధ, గురువారాల్లో ముంబై, హైదరాబాద్‌లోని మొత్తం 13 ప్రాంతాల్లో చేపట్టిన సోదాల్లో రూ.8.6 కోట్ల నగదుతోపాటు రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ఏపీ, తెలంగాణలో స్థిరాస్తులకు సంబంధించి పెద్దమొత్తంలో డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

హైకోర్టు తీర్పుతో..

ముంబై వీవీఎంసీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో రెసిడెన్షియల్, కమర్షియల్ కాంప్లెక్సులు అక్రమంగా నిర్మించారు. ఆ ప్రాంతం వీవీఎంసీ అభివృద్ధి ప్రణాళిక ప్రకారం మురుగునీటి శుద్ధి కర్మాగారం, డంపింగ్ గ్రౌండ్ నిర్మాణం కోసం రిజర్వు చేయబడింది. ఇందులో 2009 నుంచి 41 అక్రమ భవనాలు నిర్మించారు. ముంబై హైకోర్టు ఆదేశంతో ఈ అక్రమ నిర్మాణాలను ఈ ఏడాది ఫిబ్రవరి 20న కూల్చివేశారు. ఈ వ్యవహారంలో ముంబైలోని మీరా భయాందర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ కుంభకోణంలో కీలక నిందితులుగా బిల్డర్లు సీతారాం గుప్తా, అరుణ్ గుప్తా సహా వీవీఎంసీ అధికారులు, మరికొంత మందిని గుర్తించింది. అక్రమ నిర్మాణాలకు వైఎస్ రెడ్డి అనుమతులు ఇచ్చినట్లు ఈడీ విచారణలో తేలింది. కేసు దర్యాప్తులో భాగంగానే వైఎస్‌రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు గత రెండు రోజులుగా సోదాలు నిర్వహించారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్టు తెలిపారు.

చదువుకుంటే ప్రపంచాన్నే చుట్టేయొచ్చు

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్(బాలానగర్): నేడు చదువుంటే ప్రపంచ దేశాలను సైతం చుట్టేసి రావొచ్చని, ప్రతిఒక్కరు తమ పిల్లలను చదివించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువారం బాలానగర్ మండలంలోని ఎడుగుట్టలతండాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాడు బీఆర్ అంబేడ్కర్ ఎంతో కష్టపడి చదివి ప్రపంచదేశాల్లో పేరు తెచ్చుకున్నారన్నారు. రాజ్యాంగాన్ని రాసి రాజ్యాంగ రూపకర్తగా నిలిచారన్నారు. యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తన సొంత డబ్బులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు షూలను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం బడిబాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, నాయకులు రాజేందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, తిరుపతి, వెంకట్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీల్లో కంటి పరీక్షలు



మేధో వైకల్యంపై తల్లిదండ్రులతో చర్చిస్తున్న ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం (ఫైల్)

- ఆర్‌బీఎస్‌కే బృందాలతో నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో 2,21,434 మంది చిన్నారులు
- జూన్ 10 నాటికి పూర్తిచేసేలా ప్రణాళికలు

జడ్చర్ల టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే బృందాలతో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4,300 అంగన్‌వాడీ కేంద్రాలు.. 2,21,434 మంది చిన్నారులు ఉన్నారు. మొత్తం 26 ఆర్‌బీఎస్‌కే బృందాలతో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 7 బృందాలు ఏడుగురు ఆప్తాలమిస్టులతో ప్రతిరోజు శిబిరాలు కొనసాగుతుండగా.. మిగిలిన జిల్లాల్లో వైద్యుల కొరత కారణంగా రోజు విడిచి రోజు కొనసాగుతున్నాయి. ఏప్రిల్ 7న ప్రారంభమైన కంటి పరీక్షల నిర్వహణ జూన్ 10 నాటికి పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించారు. శిబిరాల్లో 6 నెలల చిన్నారి నుంచి ఆరేళ్ల విద్యార్థి వరకు కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు మేధో వైకల్యాలు, ఎదుగుదలలోని మైలురాళ్ల మూల్యాంకనం సైతం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదివిన విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఆ కార్యక్రమం విజయవంతం కావడంతో ప్రభుత్వం అంగన్‌వాడీల్లోని చిన్నారులపై దృష్టిసారించింది.



జడ్చర్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌బీఎస్‌కే వైద్యులు (ఫైల్)

సమగ్ర కంటి పరీక్షలు..

ముఖ్యంగా దృష్టి లోపం (దగ్గర, దూరం), మెల్ల కన్ను, కనురెప్పలు వాలిపోవడం, పై కనురెప్పల పొక్కులు, నిష్టగమస్-కనుగుడ్ల అనియంత్రణ, జన్మతా కంటి శుక్లాలను గుర్తిస్తున్నారు. లోపాలను గుర్తించి వారిని ప్రత్యేక చికిత్సల కోసం డీఈఐసీ, మహబూబ్‌నగర్ జీజీహెచ్‌కు రెఫర్ చేస్తున్నారు.

మేధో వైకల్యాలు..

కంటి పరీక్షలతో పాటు పిల్లల్లో మైలురాయి మూల్యాంకనం, మేధో వైకల్యాలు సైతం గుర్తిస్తున్నారు. ఇందుకోసం 42 ప్రశ్నలతో రూపొందించిన ఓ జాబితా రూపొందించి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి శారీరక, మానసిక వైకల్యాలు గుర్తిస్తున్నారు. అలా గుర్తించిన వారికి మెరుగైన చికిత్స కోసం డీఈఐసీకి రెఫర్ చేయనున్నారు.

జిల్లాలో 56,854 మంది చిన్నారులకు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 1,163 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 56,854 మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేస్తున్నాం. 6 నెలల పసికందు నుంచి ఆరేళ్ల చిన్నారి వరకు అందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇంతకుముందు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశాం. వీటితోపాటు మేధోవైకల్య పరీక్షలు చేసి చిన్నారుల ఆరోగ్య వివరాలన్నీ తెలుపడంతో వారి జీవితానికి భరోసా కలుగుతుంది.

– డా.కృష్ణ, డీఎంహెచ్‌ఓ, మహబూబ్‌నగర్

జూన్ 10 నాటికి పూర్తిచేస్తాం..

6 నెలల చిన్నారి నుంచి ఆరేళ్ల బాలల వరకు కంటి పరీక్షలు చేస్తున్నాం. దీంతోపాటు మానసిక వైకల్యం, మేధోవైకల్యం నిర్ధారణ జరుపుతున్నాం. జడ్చర్ల, మిడ్జిల్ ఆర్‌బీఎస్‌కే పరిధిలో జూన్ 10 నాటికి పరీక్షలు పూర్తిచేస్తాం.

– డా. సునీల్, ఆర్‌బీఎస్‌కే వైద్యుడు, జడ్చర్ల

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి

మన్ననూర్/కల్వకుర్తి టౌన్: అన్ని వర్గాలకు సామాజిక న్యాయం అందించే పరిపాలన కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమవుతుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి అన్నారు. అమ్రాబాద్ మండలం మాచారంలో ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఐటీడీఏ పీఓ రోహిత్‌రెడ్డిలతో కలిసి వారు ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం జలంధర్‌రెడ్డి ఇంటి వద్ద, కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీ మల్లు రవి మాట్లాడారు. ఇందిరా సౌరగిరి జల వికాస పథకం ప్రారంభోత్సవంలో ఏమాత్రం లోటుపాట్లు ఉండకూడదని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇదే మాచారం గ్రామంలోని ఆదివాసీ చెంచుల ఊపిరి తీయాలని చూస్తే.. నల్లమల బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని.. సీఎం పదవి నుంచి తప్పుకోవాలని నీతిమాలిన అసత్య గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన విషయంలో ఏకాభిప్రాయంతో నడుస్తుందని.. సీఎం రేవంత్ రెడ్డి ఎజెండానే తమందరి ఎజెండా అని తెలిపారు. అత్యంత వెనకబడిన గిరిజనుల కోసం ఇందిరా సౌర గిరి జల వికాసం పేరుతో నూతన పథకాన్ని ప్రారంభించేందుకు ఈ నెల 18న ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు నల్లమలకు రానున్నారని చెప్పారు.


- ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. అచ్చంపేట నియోజకవర్గంలోని మారుమూల గ్రామంలో రూ.12,600 కోట్లతో ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభించడం హర్షణీయమన్నారు. ప్రస్తుతం ఆదివాసీలతో ప్రారంభమయ్యే ఈ పథకం.. ఎస్టీలలోని ఇతర వర్గాలతో పాటు ఎస్సీ, బీసీ, మైనార్టీ నిరుపేద కుటుంబాల్లోని రైతులకు కూడా వర్తింపజేసేందుకు కృషి చేస్తామన్నారు. మాట తప్పం.. మడమతిప్పం అనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందని తెలిపారు.
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గంలో మరో భద్రాద్రిగా విరాజిల్లుతున్న సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 25కోట్లు కేటాయించినట్లు చెప్పారు. మరో రూ. 75కోట్లు కేటాయించాలని సీఎంను కోరుతామన్నారు. సీఎం పర్యటనలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశాల్లో మాజీ జెడ్పీటీసీ డా.అనురాధ, పీసీసీ మెంబర్ బాలాజీ సింగ్, నాయకులు రాములు, రాజేందర్, శ్రీనివాసులు, మల్లేష్, ఆనంద్ కుమార్, విజయ్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భూపతిరెడ్డి ఉన్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

- నిలిచిన 167వ నంబరు జాతీయరహదారి విస్తరణ పనులు
- కొలిక్కిరాని మహనీయుల విగ్రహాల తరలింపు
- దుమ్ము, ధూళితో ప్రయాణికులకు ఇబ్బందులు



రోడ్డు మధ్యలో నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాలు



పాతబస్టాండ్ వైపు కంకర వేసి వదిలేసిన రోడ్డు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రధాన చౌరస్తా సిగ్నల్‌గడ్డ వద్ద 167వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ముఖ్యంగా పనులకు ఆటంకంగా మారిన మహనీయుల విగ్రహాల తరలింపు కొలిక్కి రాకపోవటమే సమస్యగా మారింది. దీంతో కాంట్రాక్టర్ అసహనం వ్యక్తం చేస్తుండగా.. ప్రయాణికులు దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. సిగ్నల్‌గడ్డ వద్ద డా.అంబేడ్కర్, మహాత్మాజ్యోతిరావు పూలే, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాలు తొలగించాల్సి ఉంది. అయితే వీటిని మళ్లీ ఎక్కడ ప్రతిష్ఠించాలనే విషయంపై స్పష్టత లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇందుకోసం మూడుసార్లు సమావేశాలు జరిగినప్పటికీ ఏకాభిప్రాయం కుదరడం లేదు.

కంకర వేసి..

లయన్స్‌క్లబ్ వద్ద రోడ్డు తవ్వి కంకర వేసి వదిలేశారు. పట్టణంలోకి వెళ్లే వైపు సగం తవ్వి సగం మెటల్ వేశారు. అంబేడ్కర్, పూలే చౌరస్తాలో పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. పూలే విగ్రహం అలాగే ఉంచి మట్టి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట కంకర పర్చి వదిలేశారు. ఆరాధ్య మార్ట్ వైపు సగం తవ్వి విడిచిపెట్టారు. ఇలా ఉన్న కొద్ది పాటి ప్రాంతంలోనే పనులు వదిలి వేయటంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు, వాహనదారులు, పట్టణంలోకి వచ్చి వెళ్లేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విగ్రహాలు తొలగిస్తేనే పనులు ముందుకు సాగుతాయని కాంట్రాక్టర్ జాతీయ రహదారుల శాఖ అధికారులకు తెలియజేశారు. ప్రస్తుతం మెయింటెనెన్స్ వాల్ నిర్మాణం మాత్రమే జరుగుతుంది. ఇది పూర్తయ్యాక పనులు పూర్తిగా నిలిచిపోయే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే విస్తరణ పనులకు పూర్తిగా బ్రేక్ పడినట్లవుతుంది. ఇప్పటికే మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు మరింతకాలం సమస్యతో సతమతమవ్వాల్సిన దుస్థితి ఏర్పడనుంది. ఈ విషయమైన ఏం చేయాలో తెలియక జాతీయ రహదారుల శాఖ అధికారులు అయోమయానికి గురవుతున్నారు.

విగ్రహాల తరలింపు సంగతేమిటో..

రోడ్డు విస్తరణ పనులు ముగిసిన తర్వాత ఆ విగ్రహాలను అక్కడే ప్రతిష్ఠించాలని కులసంఘాలు పట్టుబడుతున్నాయి. అందుకు జాతీయ రహదారుల శాఖ ససేమిరా అంటుండటంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. మహబూబ్‌నగర్, కొడంగల్ పట్టణాల్లో జాతీయ రహదారి సర్కిల్స్‌లోనే డా.అంబేడ్కర్ విగ్రహం ఉండటాన్ని కొందరు ప్రస్తావిస్తున్నారు. అక్కడ లేని నిబంధనలు ఇక్కడెందుకు అంటూ నిలదీస్తున్నారు.

స్పందించని ఎమ్మెల్యే, ఎంపీ

విగ్రహాల తరలింపు, పునఃప్రతిష్ఠపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ స్పందించాల్సిన సమయం వచ్చింది. ఇప్పటికే పనులు ఆలస్యం కావటం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు జోక్యం చేసుకుని అందరి ఆమోదం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.